


- విమలా రామం



అమ్మ ఒడిలో . . .
ఫోటో— బి. పి. రెడ్డి
( హైదరాబాదు – 9 )

కుస్తున్న ఆమె శరీరావయవాలు ఆమె అంతర్గత భయాక్రందనలని వినిపిస్తున్నాయి. ఒంటిమీది వలువలు వలుస్తున్న క్రూరహస్తాన్ని ప్రతిఘటించలేని నిస్సహాయ స్థితిలో గిలగిల లాడుతున్న దామె తనూలత.

"ఆగం దాగండి, బాబూ! అంత గోరం సేయమోకండి. పున్నెముంటుంది. అమ్మాయిగోర్నొగ్గెయ్యండి." రాముడు చేతులు జోడించాడు.

"పానకంలో పుడకలాగ ... వీడెవ్డ్రా ఊనిగాడు?"

"ఇచ్చిన పదీ చాల్లేదేమిట్రా?"

"ఆశపాతకపు వెధవ ..."

"మరో పది పారెయ్యరా!"

"పదేం కర్మ! వంద పారేస్తాను. తీసుకు పొమ్మను."

వంద నోటు వచ్చి మీద పడింది. ఆ నోటు, బొడ్డులో దోపుకున్న పది నోటు దోసిట పట్టాడు రాముడు. "కానీ డబ్బుకోసం రాలేదు, బాబుల్లారా!"

"మరెందు కొచ్చావురా?"

"అమ్మాయిగార్ని రక్షిద్దామని వచ్చాడు. పిచ్చి వెధవ!"

"కాదురా! తను కూడా మనతో కలుద్దామని!"

వాళ్ళు పగలబడి నవ్వారు. రాముడు భరించలేని అవమానంతో తల దించుకున్నాడు.

"ఓర్నీ! వీడంత మగాడ్రా?!"

"ఏరా, రాముడూ! నువ్వెప్పుడయినా ఎవర్నయినా ఇలా చేశావుటా?"

"అలా తెల్లబోయి చూస్తావేమిటి? ఇదేం తెలియదేమో!"

"తెలియకపోవడ మేమిటి? సినిమాల్లో చూసే ఉంటాడు."

"నా దొక్కడేం కర్మ! ఇప్పుడిప్పుడే కదా సినిమాలు ఆ సీను చూసేనస్తోంది అమ్మాయిగారు ... ఆవిడకీ తెలుసు కాస్సేపట్లో ఏమౌతుందో!"

వాళ్ళు వినోదిస్తూ చప్పట్లు కొట్టారు. అవి రాముడి గుండెల మీద పిడిగుద్దుల్లా ఉన్నాయి.

"పూర్ ఫెలో! రిక్షాలో ఎక్కించుకుని మోయటమే కాని, అమ్మాయిగారి బుగ్గలు రుచి చూసే అదృష్టం లేకనే పోయింది!"

"పోన్లే, ఈ పూట నక్క తోక తొక్కొచ్చాడు."

ఆ నాగరికుల నోటి వెంట వచ్చే అనాగరిక పదాలు వినలేక సిగ్గుతో చిక్క చచ్చిపోయాడు రాముడు.

"మీ కాలు మొక్కుతా, బాబూ! ఆ యమ్మనొగ్గేసెండి, బాబూ!"

"అంత తేలిగ్గా ఎలా వదిలి పెడతా మనుకున్నావురా! మా అమ్మాయిగారి పొగ రణచద్దూ?"

"ఆడపిల్ల, బాబూ! తమకే టన్యాయం సేసిందని?"

"ఏం చేసిందో నీకేం తెలుసురా? మాకు తెలుసు ... మా వాడు, అదిగో వాడు — మనసుపడి ప్రేమలేఖ వ్రాశాడు. ఇష్టం లేకపోతే వాడితోనే చెప్పచ్చుగా? ప్రిన్సిపాలుతో చెప్పి సస్పెండ్ చేయించింది. దానితో వాడి చదువు నాశన మయినట్టేనా? ఇలాంటి దానికి బుద్ధిచెప్పకుండా ఎలా వదులుతా మనుకున్నావు?"

"అంత చిన్న తప్పుకి ఇంత పెద్ద శిక్షా, బాబూ! బయంతో ఆ యమ్మ గుండెలు పగిలిపోతున్నాయి—సూడండి, బాబుల్లారా!"

"భయం కాదురా, ముద్దు మోహమూ— పరవశం!"

"కావాలంటే ముద్దిచ్చి చూడు. ఇంకెంత పొంగిపోతుందో!"

"పాపం, వాడికి తెలియదు. నువ్వు చూపించరా!"

పిచ్చెక్కిన పులి ఒకటి బలిమేక మీదికి లంఘించింది.

"బాబూ!" అని ఒక అరుపు అరిచి, ఒక్క దూకులో అడ్డు వచ్చాడు రాముడు.

"వయ్యారా వెధవని!" ఒకడు అరిచాడు. మరొకడు కర్ర వేసేశాడు.

రాముడి తల చిట్లింది. ఫౌంటెన్ లోంచి నీళ్ళు చిమ్మినట్లు రక్తం పెల్లుబికింది. ధారలు కట్టి వాడి ముఖం మీదికి పార్లి వచ్చింది. నిలబడలేక మోకాళ్ళ మీద నేల కొరిగిపోయాడు రాముడు.

ఊహించని ఆ పరిణామానికి వాళ్ళు నిర్ఘాంతపోయారు. ఎక్కడివా ళ్ళక్కడే నేల కంటుకు పోయారు. అంతవరకు పిశాచాలు నృత్యం చేసిన ఆ కళ్ళలో భయం గజ్జె కట్టింది.

కళ్ళ కడ్డు వస్తున్న రక్తపు ధారల్ని మునివేళ్ళతో తుడుచుకుంటూ వాళ్ళ వైపు చూశాడు రాముడు. రక్తసిక్త హస్తాల్ని వాళ్ళకు చూపిస్తూ, "మడిసిని సంపాలంటే ఒక్క దెబ్బ సాల్దు, బాబూ! రెండో దెబ్బెయ్యాల. ఎయ్యండి ... మరో టెయ్యండి. నా ఒంటో రగతమంతా కారేదాకా ఎయ్యండి" అన్నాడు.

ప్రాణం వదిలిన కట్టెల్లా బిర్ర బిగిసి పోయారు వాళ్ళు.

"నా రగతమే కాదు, బాబూ! తమ రా యమ్మ మీద సెయ్యెయ్యనంటే నా పేణాలు కూడా ఇచ్చేత్తాను."

ఒకళ్ళవైపు ఇంకొకళ్ళు తిరిగి చూడ్డానికి కూడా భయపడుతున్నారు వాళ్ళు.

"నాకు తెలుసు, బాబూ! తమరు నన్ను సంపరు; సంపనేరు. మడుసుల్ని సంపేవోళ్ళు తమలా ఉండరు. సావ [illegible]యు వోడు సెప్పే కబుర్లినుకోరు. మరోమాట్టాకుండా మట్టికరిపిత్తారు. తమరలాంటోళ్ళు కాదు. దొరబాబులు. దొడ్డ మనసున్నవోళ్ళు. సదూకుంటున్నోళ్ళు. తమకి మంచి, సెడు తెలుసు. కాలు జారినా కూడా తీసుకోపడం తెలుసు. నాను సదూకున్నోడిని కాను. గొప్పింటోణ్ణి కాను. ఇవరంగా సెప్పగలిగినోణ్ణి కాను. అయినా, ఒక్క మాట సెపుతా. ఇనుకోండి, బాబూ! ..."

వాళ్ళ కళ్ళకి రెప్పలు వేసుకునే శక్తి పోయింది. వాళ్ళకళ్ళిప్పుడిప్పుడే నేలకి దిగి వస్తున్నాయి.

"ఒక్కసా లాయమ్మ కేసి సూడండి. గోరం జరిగాక ఏ ఆడకూతురయినా ఇంక బతికుంటుందా, బాబూ! తనలాంటి దొరబాబుని పెళ్ళిసేస్కొని బంగారం లాంటి బిడ్డల్ని కనాల్సిన దొడ్డతల్లి, తెల్లారేసర్కి సచ్చిపోవలసిందేనా? ఒక్కసా లాలోసించండి! ఆ యమ్మలో మీ సెల్లెమ్మను సూడండి. మీ అక్కమ్మని సూడండి. ఆపైన సంపేత్తే మంచిదో తమకే తెలుత్తుంది. తమ రెంత మంచి సేయగల్రో తమకే తెలుత్తుంది."

ఒకళ్ళవైపింకొకరు చూసుకున్నారు వాళ్ళు. ఒకళ్ళ నొకళ్ళు అసహ్యించుకుంటున్నారు వాళ్ళు. తమని తాము చూసుకోలేక రాముడి వైపు తలలు తిప్పారు వాళ్ళు.

"తమ రీత క్కాకుండా మరేదకయినా ఎల్లంటే [illegible] నాన్సెప్పలేను. తమరు కాకుండా మరెవరయినా ఈడుంటే నేను బతికేవోణ్ణో లేదో నేన్సెప్పలేను. కాని, తెల్లారేసర్కి ఆయమ్మ పేణాలు తీస్కొనుండేది. కసాయో దొక్కడుంటే సాప మంచోళ్ళు నలుగురున్నా కాసుకోలేరు, బాబూ! తలుసుకుంటే తమ సేతుల్లో నా పేణా లెంత? పది రూపాయలు నా సేత పెట్టినప్పుడే తమరలాంటోళ్ళు కాదనుకున్నా. తమరలాంటోళ్ళు కాదు కనకనే రెండో దెబ్బకి వెనకాడుతుండారు ..."

రక్తస్రావంతో నిస్త్రాణపడి నేల మీద కూలబడ్డాడు రాముడు. ఇంకా రక్తం పెల్లుబికి వస్తూనే ఉంది. గుర్తు తెలియనంత భయంకరంగా వాడి ముఖం రక్తసిక్తమై ఉంది. "తమలో మంచి వెలిత్తే నా కంతే శాన. ఆయమ్మ బతుకు

పండితే నా కంతే శాస. కొట్టినందుకు ఆమె నెప్పుడూ తప్పట్టను ... తప్పట్టను ..."

రాముడు స్పృహ తప్పి పక్కకు పడి పోయాడు. వాడి చేతులింకా వాళ్ళవైపు జోడించిన వలాగే ఉన్నాయి!

రాముడికి స్పృహ వచ్చేసరికి తెల్లగా తెల్లవారినట్లయింది. అపస్మారకస్థితిలో కూడా, "అమ్మాయిగారూ! ... అమ్మాయిగారూ! ... నే వత్తున్నా ... నే వత్తున్నా నుండండమ్మా!" అని పలవరిస్తూనే ఉన్నాడు.

"రాముడూ!" అమ్మాయి గారి గొంతు వినిపించింది. వాడి మగత పడి పోయింది. చటుక్కున కళ్ళు తెరిచాడు.

చుట్టూ కలయజూసి రాముడు ఆశ్చర్యపోయాడు. అమ్మాయిగారే కాదు, వాళ్ళు నలుగురూ ఉన్నారు. డాక్టర్లు ఉన్నారు. నర్సు లున్నారు. అంతా ఆత్రంగా వాడివైపు చూస్తున్నారు. అది రెడ్డిగారి బంగళా కాదు — కుమార్ గారి హాస్పటల్.

అమ్మాయి గారి వైపు చూశాడు రాముడు. ఆమె కనురెప్పలలో ముత్యాలు నిలిచి ఉన్నాయి. ఆమె అధరాల పైన రతనాలు మెరిసి ఉన్నాయి. ఆమె దేవాలయంలో భక్తురాలిలా అర్ధనిమీలితంగా,



ఆరాధనగా వాడి వైపు చూస్తూంది. ఆదేం వాడికి తెలియదు. అమ్మాయిగారు తేటకళతో తన కళ్ళముందు నిలిచి ఉంది. అదొక్కటే తెలుసు. అదిమాత్రం చాలు. తనకు దెబ్బ తగిలిన ధ్యాసే లేదు వాడికి!

వాళ్ళవైపు చూశాడు రాముడు. వాళ్ళిప్పుడు పులుల్లా లేరు; సింహాల్లా లేరు; కరుణ నిండిన గోవుల్లా ఉన్నారు. శాంతిని కోరే పావురాల్లా ఉన్నారు. ఆదేం వాడికి తెలియదు. వాళ్ళు మంచిని పెంచిన మనుషుల్లా ఉన్నారు. చెడ్డను చంపిన విజేతల్లా ఉన్నారు. అది వాడికి తెలిసింది. అదే వాడికి కావలసింది. తనకు దెబ్బ తగిలిన ధ్యాసే లేదు వాడికి!

"ఎలా ఉంది, రాముడూ?" అమ్మాయిగా రడిగింది.

"మీా రెలా ఉన్నారమ్మా?" అది వాడి జవాబు.

అందర్నీ తప్పించుకొని పోలీసు ఇన్‌స్పెక్టరు ముందుకు వచ్చాడు. రాముడు కంగారు పడ్డాడు.

"నీ పేరేమిటి?"

"రావుణ్ణి, దొరా! రిక్షా రావుణ్ణి."

"నీ కీ దెబ్బ ఎలా తగిలింది?"

జవాబుకోసం వాడు వెదుక్కోలేదు. "కళ్ళు తిరిగి ... అదే, బాబూ! రోడ్డు మీాద పడిపోయినా. తలకి తగిలి ఇలా గయింది."

"అదేమిటి? నిన్ను కొట్టారని ఈ అబ్బాయిలు చెబుతున్నారే!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

రాముడు అటు చూశాడు. ఇటు చూశాడు. చిరునవ్వు నవ్వాడు. "అదేంటి, బాబూ! దెబ్బ తిన్నోడు కొట్టలేదంటే ఆ కుర్రాళ్ళు మా టట్టుకుంటారేంటి? అస్సలు నాకు పెద్దెబ్బ తగ్లందే!" అంటూ చటుక్కున పైకి లేచి కూర్చున్నాడు.

వాళ్ళంతా ఆశ్చర్యం నుంచి తేరుకోనే లేదు.

"పదండమ్మా! అప్పుడెప్పుడో మీరు తను కోసం ఎదురు చూస్తుంటారు. అబ్బే, అప్పుడే పొద్దెక్కిపోయింది" అంటూ హాస్పిటల్ బెడ్ మీద నుంచి పడిచి బయటకు నడిచిపోయాడు రాముడు.

ఏ శక్తి వాడి నలా నడిపిస్తూందో వాళ్ళు కంతుపట్టలేదు. శక్తి విహీనులై వాళ్ళంతా అక్కడే నిలబడిపోయారు.

అందరికన్న ముందు తేరుకున్న అమ్మాయి గారు బయటకు నడిచింది. తన రిక్షా దగ్గరకి పోయి సిద్ధంగా ఉన్నాడు రాముడు.

తలకి ఉన్న కట్టుకన్న తెల్లగా ఉంది వాడి చిరునవ్వు. "ఆ బాబులు శానా మంచోళ్ళమ్మా! నేపోతే, నా రిక్షా తెచ్చి ఈ గుమ్మంకా డుంచుతారా?"

దేశం పటిష్ఠతకోసం
ఏకం కండి.

గత దినం వరకు పరిగ్గా ముఖంవైపైనా చూడనిఅమ్మాయిగారు ఇప్పుడువాడి నాపాదమస్తకం పరిశీలించి చూస్తూంది. ఎన్నో చెప్పాలనుకుంటూంది. కాని, ఎలా చెప్పాలో తెలియటం లేదు. ఏమీా చదువు కోని రాముడు తెలియని దెంతో చెబుతున్నాడు. ఎంతో చదువుకున్న తను ఏమీా చెప్పలేనిదయింది. 'ఇప్పుడయినా నా భావాలకి భాషను ప్రసాదించు, భగవంతుడా!' అని ఆమె దైవాన్ని ప్రార్థిస్తూంది.

రాముడి కళ్ళలో నీళ్ళు చూసింది అమ్మాయిగారు.

"దెబ్బ బాధగా ఉందా?" ఎలాగో అనగలిగింది ఆమె.

"బాధ కాదమ్మా! సంతోషం. అమ్మాయిగోర్ని భద్రంగా ఇంటికి తీసుకెళుతున్నందుకు సంతోషం."

కళ్ళు మూసుకుంటూ రిక్షాని అనుకున్నాడు రాముడు. మట్టికొట్టిపోయిన వంచె చెంగుతో కళ్ళద్దుకున్నాడు.

"నొప్పెడుతోందా, రాముడూ?" మళ్ళీ గొంతు పెగుల్చుకుంది అమ్మాయిగారు.

"ఇంకా దెబ్బెక్కడుందమ్మా! అదంత అడనే పోయింది ... పదండి. రిక్షా ఎక్కండి."

"వద్దు, రాముడూ, వద్దు. మళ్ళీ ఇన్‌స్పెక్టరు గారి దగ్గర అబద్ధమాడినా ఈ మాటు నిజంగానే కళ్ళు తిరిగి పడిపోతావు."

రాముడు గలగల నవ్వాడు. "మీా దొడ్డ బయ మమ్మాయిగోరూ! ఇప్పుడు నా కెంత బలంగుందో తమకేం తెలుసు? నా సేతులికి తెలుసు. నా కాళ్ళకి తెలుసు. తొరగా పదండమ్మా! సీత నాకోసం కాసుకునుంటుంది. రేత్రంతా ఏమయిపోయానో అని ఎదురెదురు సూత్తుంటుంది!"

• • •

"ఏం, రాత్రంతా ఏమయ్యావు? సిగ్గూ ఎగ్గూ లేదూ?" కనకరాజుగారు ఎగిరెగిరి పడ్డారు.

"ప్రాణాలతో బయటపడ్డాము. అందుకు సంతోషించు." రాముడు చేసిన మహోపకారాన్ని వేనోళ్ళ కొనియాడబోయి ఉన్న ఒక్క నోరు మూసుకోవలసి వచ్చింది అమ్మాయి గారికి.

"ఏం, మీా ప్రాణాల కేమయిందిప్పుడు? ..." తాను ప్రాణాలతో ఎందుకు బ్రతికున్నదా — అని వాపోయింది అమ్మాయిగారు.

"కారొచ్చి రిక్షాని గుద్దేసింది, బాబుగోరూ! నాను కిందడిపోయినా ... అమ్మాయిగోరే వ న్నాసుపత్రికి తీసుకుపోయారు."

విశ్రాంత పోయింది అమ్మాయిగారు.

"వెళ్ళు వెళ్ళు వెధవ సోదీ మనుష్య! ఈ రోజుల్లో ఏ వెధవనీ నమ్మకూడదు. గుండెలు తీసిన బంట్లు" అని కసురుకున్నారు కనకరాజుగారు.

వడిసెల దెబ్బ తిన్న లేడికూనలా గింగిలాడిపోయింది అమ్మాయిగారు.

తల దించుకున్న రాముడు, "సీత ఈ పూట పనికొచ్చిందా, బాబుగోరూ?" అని నెమ్మదిగా అడిగాడు.

"రాత్రి నీకోసం చూసి చూసి పోయింది. తెల్లారి ఇంత వరకునత్తా లేదు" అని తల తిప్పుకొని లోపలికి వెళ్ళబోయా రాయన.

ఆయన డబ్బు లివ్వలేదు. రాము డడగలేదు. రిక్షా తొక్కుకుంటూ వెళ్ళబోతున్న రాముడిని కనుమరుగయ్యేంత వరకూ సజల నేత్రాలతో చూస్తూండిపోయింది — సిగ్గుతో బిక్క చచ్చిపోయిన అమ్మాయిగారు!

• • • •

ఇంటి ముందు జనం మూగి ఉన్నారు. రిక్షా సీటు మీాదనుంచి ఒక దుముకు దుముకి జనాన్ని తోసుకుంటూ ముందుకు దూసుకు పోయాడు రాముడు.

రాముడి గుడిసె సగం తగలబడిపోయి ఉంది. రాముడి ఇల్లాలు సగం తగలబడి పోయి ఉంది.

రాముడి గుండె లవిసిపోయాయి. అమ్మాయిగారిని ఎలా కాపాడిందీ తన సీతకు చెప్పి మెప్పు పొందాలని వచ్చాడు రాముడు. అదేమీా వినలేని స్థితిలో వాడి అందాల సీత నిప్పులో, ఉడికుడికి, మంటల్లో మాడి మాడి మట్టిలో కలవటానికి సిద్ధంగా ఉంది. కొనప్రాణంతో వాడి చివరి చూపు కున్నట్టు మిగిలి ఉంది.

"రావుడొచ్చాడే, సీతమ్మా! కళ్ళు తెరవ్వే, తల్లీ!" ఎవరో దగ్గిరి వాళ్ళు గుండెలు బాదుకుంటున్నారు.

"ఎలా జరిగిందయ్యా ఈ గోరం!" ఇంకెవరో గుంపులో అడిగారు.

"పొయ్యి రాజేసిందట. సెంట్రాణి కిరసనాలు డబ్బా నిప్పులో పడిందట. పాపం, ఒక్కసారి ఒళ్ళంతా అంటుకుపోయింది." మరెవరో జవాబు చెప్పారు.

"నాటు కాడికి తీసుకుపోయినాం. నాబం లేదన్నారు" అన్నాడు మరొకతను.

రాముడు గుండెలు బాదుకుంటున్నాడు. "నా కన్నాయం సేసేవా, సీతా! నే నేన్నేం సేసేనే? నా కెందుకీ సిచ్చేసినావే?"

వాడి ఆలాపన సీతకు స్పృహ తెప్పించింది. వాడివైపు చూసింది. ఆమె కనుకొన కనుకొలకుల్లో నీళ్ళు నిండాయి. బొబ్బ లెక్కిన పెదాలు అతి కష్టం మీాద కదిలాయి.

"ఏదో సెప్తూంది, ఇనరా, రావుడూ!" ఎవరో హెచ్చరించారు.

రాము డాత్రంగా ఆమె నోటి దగ్గరికి చెవి పెట్టాడు.

"నీ తలకేమైంటి? నీ కేటయింది, మావా?"

సీత అడిగేదాకా రాముడికి తన దెబ్బ సంగతి గుర్తే రాలేదు. అక్కడ తగిలిన నా దెబ్బ గుర్తుండలేదు.

"నిన్న దెబ్బ. నాకేం ఎక్కదు. కాని, నీకేమయింది, సీతా? ఇంత గోరం ఎలా జరిగింది?"

"ఏమయిన, మావా! ఏమయిన. ఇప్పుడు జేసినా నీ సీత నిను బతక రాదు."

"లేదు, సీతా! నువ్వు పోకూడదు. నిన్ను పోనివ్వను. పెద్ద నాటు కాడికి తీసుకుపోతాను." రాముడు లేవబోయాడు. ఆ బలహీనమైన చేతులతో వాణ్ణి తన మీాదికి లాక్కుంది సీత.

"లేదు, మావా! నేనింక బతకను! నా కింక బతకాలని లేదు ..."

"ఎందుకు? నా కన్నాయం సెయ్యాలనుకుంటున్నావా, సీతా!"

"మన్నేటి సేసేనో నాకు తెల్దు. నా పిచ్చిగా అనుకుంటే నీ కోసం ఎదురుసూసినా సూసినా. ఎంతసేపు సూసినా నువ్వు రానే లేదు. ఊరికెళ్ళిన పెద్దమ్మగోరూ రాలేదు. సిన్నాకెళ్ళిన సిన్నమ్మగోరూ రాలేదు ... నా దురదృష్టం తలసోస్తున్నా."

"ఏమయింది!" సీతను ఒడిసి పట్టుకున్నాడు రాముడు.

వాళ్ళ సంభాషణ ఎవరికీ అర్థం కావటం లేదు. ఆమె ఏం చెప్తూందో వాళ్ళకు వినిపించటం లేదు. వాడికి మతి తప్పలేదు కదా — అని భయపడుతున్నారు.

"అయ్యగారు పుస్తెం కట్టుకున్నారు! ఈ సీత నీకు సరి కాదు, మావా! ... నే పంటుంచ లేనూ, మావా!" ★